# ఆకలి

[ " క్షుధాతురాణాం నరుచిర్నపక్వం
కామాతురాణాం నభయం నలజ్జా .... "

ఆకలి అనేక రకాలు. అది తీర్చుకునేటందుకు మానవుడు అనాదిగా అనేక మార్గాలు అవలంభిస్తున్నాడు. ఉచ్చనీచాలు గమనించకుండా అవసరం తీరితే చాలనుకోవటం ........ అడ్డుదార్లు తొక్కటంలాంటి సందర్భాలు కోకొల్లలు.

ఇదొకరకం ఆకలి కథ. ఈ కథలో క్షుద్బాధ కేవలం శరీరానికీ మనస్సుకూ సంబంధించినది. ]

చీకటిరాత్రి ...

అనేక పాపాలకు ఆలవాలమైన చిమ్మ చీకటి...

బస్టాండు నిర్మానుష్యంగా వుంది.

ప్రయాణీకుల సందడి... బస్సుల రొద సద్దుమణిగింది. కరెంటు దీపాలు ఏడుస్తూ వెలుగుతున్నయ్. అది వెలుగులా లేదు. మరోక్షణంలో ప్రాణంపోయేవాడి వూపిరిలా వుంది.

బస్సులన్నీ గేరేజిలో కెళ్ళేయి.

ఒకటి రెండు బస్సులుమాత్రం బైట డిపోకి సంబంధించినవి కావటాన ప్లాట్ ఫారం మీదున్నయ్.

ఎండకాలం కావటాన ఆ బస్సుల తాలూకు డ్రైవర్లు కండక్టర్లు బస్సుటాపుమీద చాపలు విప్పుకు పడుకున్నారు.

ఓ ప్లాట్ ఫారం చివరగా ఇద్దరు లైసెన్సు పోర్టర్లు మసక వెలుగులో కూర్చుని చుట్టకాలుస్తూ ఏవో ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

ఒకదానినొకటి తరుముకుంటూ రెండు వూర కుక్కలు బస్టాండంతా పరుగిడుతున్నయ్. వాటిపరుగులో సరసమో... నిరసమో... భావమేముందో అర్థంకావటంలేదు.

అప్పటివరకూ బస్టాండంతా తిరిగి పూవులమ్ముకున్న పన్నెండేళ్ళ కుర్రాడు ఓ కరెంటు దీపంక్రింద కూర్చుని ఆ పూట అమ్మకం తాలూకు వచ్చిన,చిల్లర లెక్కచూచుకుంటున్నాడు.

బస్టాండు బైటవరుసగా బారులీరి వున్న రిక్షాల్లో ఒదమరిచి నిద్రపోతున్నారు రిక్షా పుల్లర్లు.

ఆటోడ్రైవర్లిద్దరు బాడుగ లేమీ లేకపోవటంతో 'పులీ-మేక' ఆట ఆడుకుంటున్నారు.

నాటుసారా పూటుగా పట్టించిన యాదగిరి తూలుకుంటూ అప్పుడే బస్టాండు ప్రాంగణంలోకి అడుగు పెట్టేడు.

అంతటి కైపులోనూ అతని చంకలోవున్న క్యాషుబేగ్ భద్రంగా వుందో లేదోని అప్పుడప్పుడు తడివి చూచుకుంటున్నాడు యాదగిరి.

బైటడిపోనుంచి నైటవుటు సర్వీసుకొచ్చిన యాదగిరి,.. డ్యూటి ముగియగానే 'పేబిల్లు' ఓలీ చేసుకుని... ఆ పూట కలెక్షన్ తాలూకూ డబ్బు ఒకటికి పదిసార్లు లెక్కించుకుని... లగేజితాలూకు మిగిలిన డబ్బు జేబులో పెట్టుకుని...డ్రైవరుకు ఇవ్వవలసినవాటా అతగాడికిచ్చేసి ఊరిమీద పడ్డాడు.

పగలంతా డ్యూటీతోనే సరిపోయింది. బస్సులో ఎక్కేజనం, దిగేజనం, ఎనిమిది గంటల డ్యూటీ చేసేటప్పటికి ప్రాణం కడబట్టిపోయినట్టన్పించింది. శరీరం బాగా అలిసిపోయింది. వళ్ళంతా నెప్పులుగా వుంది.

పడినకష్టం మర్చిపోయేందుకు...అలా నాలుగు బజార్లూ తిరిగినవాడల్లా... అలవాటు ప్రకారం యాదగిరి కాళ్ళు ప్రభుత్వ సారాయి దుకాణంలోకి దారితీసాయి. పీకలదాకా పట్టించాడు.

యాదగిరి మజాలో తేలిపోతున్నాడు. మత్తులో వూగిపోతున్నాడు—ఓ పావుగంట తర్వాత రెండు పావుప్లేట్ల కోడిపలావు పట్టించి తిరిగి తిన్నగా బస్టాండు చేరుకున్నాడు.

మందయితే కొట్టేడు! పలావైతే పట్టించేడు!! మరి... ఆతర్వాత కార్యక్రమం మాటేమిటి అంటూ కోరిక యాదగిరిని

గందరగోళం పెట్టసాగింది.

ఊరు పూర్తిగా కొత్త యాదగిరికి!

డ్యూటీమీద లోగడ ఎప్పుడూ ఈవూరు రానేలేదు.

అంచేత ... ఈ వూళ్ళో చీకటి వింతలేమున్నాయో యాదగిరికి బొత్తిగా తెలీలేదు.

నడుస్తున్నవాడల్లా ఆగి సిగరెట్ వెలిగించాడు. తలెత్తి ఆకాశంలోకి చూశాడు. వళ్ళు విరుచుకున్నాడు.

నోరంతా మంటగా... శరీరమంతా తిమ్మిగా వుంది.

మైకంలోవున్న యాదగిరి ... మరో ఆకలి తాలూకు అవసరం వెంటాడుతోంది. అంతకుమించిన ఆరాటం మనిషిని వూపేస్తోంది.

మరో రెండు అడుగులు ముందుకేశాడు యాదగిరి.

"ఏంటి కండక్టరు బాబూ...ఈ యాలప్పుడు తొంగోక ఇంకా తిరుగుతావుండావూ...?" సిమెంటుబల్లమీద కూర్చున్న లైసెన్సుకూలీ పలకరించాడు.

లైసెన్సు కూలీని చూడగానే పుట్టెడు ఆనందం యాదగిరి ముఖంలో వుట్టిపడ్డది. తన అవసరం తీర్చుకోనేటందుకు సాధనం దొరికినట్టు ఫీలయ్యాడు ఆ క్షణంలో.

"ఒరేయ్... ఇట్రా!...మాట!!..." తడబడుతూ పిల్చేడు యాదగిరి.

కూలీవాడు దగ్గరికొచ్చాడు. ఆప్యాయంగా వాడి భుజం మీద చెయ్యివేశాడు యాదగిరి. తనతోపాటు నడిపించాడు.

"ఏటి బాబూ..." వెంటనడుస్తున్న కూలీ అడిగేడు.

"చూడూ!... నువ్వేమీ అనుకోకు!... డబ్బు ఎంత ఖర్చయినా పర్లేదు నాకు మాత్రం మంచి సరుకు కావాలి!... కూలీవాడిని దువ్వేడు యాదగిరి.

"తవరేంటి అంటున్నారో అర్థంకావటంలేదు బాబూ..." నసిగేడు కూలి.

"చూడు! వేషాలెయ్యకు నాదగ్గర - కావాలంటే నువ్వో రెండురూపాయలు తీసుకో. పర్లేదు - కానీ... సరుకు మాత్రం ఏవన్ గా వుండాలి..." అంటూ తన అవసరాన్ని చెవిలో చెప్పేడు యాదగిరి.

నాకిట్టాంటివిసయాలు తెలీవు బాబూ...అయినా...నీమాట కాదన్లేను గనక... బైటున్న రిక్షావాడి నెవడినైనా అడిగి సూత్తాను..."

"పోయిరా త్వరగా!- వాడి మొహానకూడా ఓ అయిదు కొడతానని చెప్పు!! — చూడూ... పావలా సరకూ... బేడ సరకూ మనకొద్దు. హైక్లాస్ అయితేనే....

యాదగిరి చెప్పటం పూర్తి కాకుండానే కూలీవాడు ముందుకు సాగిపోయాడు.

యాదగిరిలో సంతృప్తి తాలూకూ ఆనందం పురక వేయ సాగింది. ఓ బెంచీమీద కూలబడాడు. మనసునిండా తీపి ఆలో చను ముసురుకో నారంభించాయి.

మంచి కేసు దొరికితే... ఇక తెల్లవార్లూ జాతరే అనుకు న్నాడు. ఘనకార్యం చేయబోతున్న వాడిలా గర్వంగా ఛాతీ విరుచుకున్నాడు.

పావుగంట గడిచేక కూలీవాడు తిరిగొచ్చాడు.

కూర్చున్నవాడల్లా హుషారుగా లేచినిల్చున్న యాదగిరి "ఏమన్నాడురా రిక్షావాడు?" ఆత్రంగా అడిగాడు.

"ఇంత రాత్రి సమయంలో వాళ్ళు నిద్దరోతుంటారు... రారని చెప్పేడు బాబూ.," అనేసి అక్కడినుండి తప్పుకున్నాడు కూలీవాడు.

సగం కాలిన సిగరెట్టుని కసిలో బలంగా నేలకేసికొట్టేడు యాదగిరి. పళ్ళు పటపట కొరికేడు. కసిగా జుట్టుపీక్కున్నాడు.

ఇప్పుడెట్లా? ... తనఅవసరం తీరేమార్గమేదీ?... మళ్ళీ నడక సాగించాడు.

రానురానూ నిషా తాలూకూ తిమ్మిరి ఎక్కువవుతోంది యాదగిరిలో. అవసరం తాలూకూ ఆకలి మనిషిని పీక్కు తింటోంది.

మరో సిగరెట్ వెలిగించాడు. ఖాళీ సిగరెట్ పెట్టెను దూరంగా గిరవాటేశాడు.

సిగరెట్టు పెట్టె గాలిలో తేలుకుంటూ కొంత దూరం వెళ్ళి నిద్రపోతున్న కుక్కపిల్లమీద పడటంతో అది వులిక్కిపడి లేచి 'భౌ... భౌ...' మంటూ పరుగులంకించుకుంది.

యాదగిరి వళ్ళు వేడితో సలసలా కాగిపోతోంది. చెమటతో జిడ్డుకారుతున్న ముఖాన్ని కర్ఛీఫ్‌తో తుడుచుకున్నాడు.

నిరుత్సాహంతో బస్టాండంతా రెండుసార్లు కలియ తిరిగాడు.

కేంటిన్ పక్కగావున్న రేకుల షెడ్డుదాకా రాగానే యాదగిరి కాళ్ళకు బ్రేకులు పడ్డాయ్.

షెడ్డులో రెండు మానవాకారాలు పడుకుని వుండటం లీలగా అవుపించాయి.

కళ్ళు విప్పార్చుకుంటూ మరోసారి షెడ్డులోకి చూశాడు యాదగిరి. మరో రెండు అడుగులు ముందుకేసి జేబులోంచి అగ్గిపెట్టెతీసి పుల్లగీచాడు. యాదగిరిలో ఆశ రాజుకుంది.

అగ్గిపుల్ల వెలుగులో పడుకున్న వాళ్ళ ముఖాల్లోకి తొంగి చూశేడు యాదగిరి.

గొంతువరకు చినిగిన దుప్పటి కప్పుకు పడుకున్న మానవాకారం ఆడమనిషనే యదార్థం గ్రహించేడు.

మరో అగ్గిపుల్లగీచి "ఏయ్...ఎవరదీ... లెగెహె..." ఆడమనిషిని తన్నేడు యాదగిరి.

నిద్రలోవున్న ఆడమనిషి తుళ్ళిపడి లేచింది. కళ్ళు నలుపుకుంటూ యాదగిరికేసి భయం భయంగా చూచింది.

"ఎవరే నువ్వు? ... ఈడ పడుకున్నావేంటే! ..." దబాయించేడు యాదగిరి.

"ఈడనే... అడుక్కుతింటూ బ్రతుకుతున్న దాన్ని బాబూ..."

"నీపక్కన పడుకున్న దెవరూ?..." రెట్టించి అడిగాడు.

"నా కూతురు బాబూ..." భయంతో వణుకుతూ చెప్పింది.

యాదగిరి మస్తిష్కంలో విద్యుల్లతలాంటి ఆలోచన తళుక్కున మెరిసింది. ఒక్క క్షణం ఆలోచించి తన్లో తాను నవ్వుకున్నాడు.

తన ఎదురుగా దిక్కులేని ముసిల్ది...దాని పక్కన వయసులో వున్న కూతురు... అయితే తన ఆకలి తీరబోతోందన్న మాట? అందులోనూ బస్టాండులో అడుక్కుంటూ బ్రతుకుతున్న జీవాలు. తనమాటకు ఎదురు చెప్పలేరు.

అనేక రకాల ఆలోచన్లు యాదగిర్ని చుట్టుముట్టేయి.

యాదగిరిలో రగులుతున్న ఆకలి మరోసారి గట్టిగా అతడి వీపు చరిచింది. నరాల తిమ్మిరి మనిషిని తొందర పెడుతోంది.

"అది... నీకూతురంటే... నొక్కి మరోసారి అడిగేడు.

"అవునయ్యా — దిక్కు లేనోళ్ళం... దినాము ఈడనే తొంగుంటూ వుంటాము..." హీన స్వరంతో గొణిగింది ముసిల్ది.

"అయితే... నువ్వోపన్జెయ్యాల.... నువ్వు కాస్సేపట్లా బైటికెళ్ళిరా..."

"ఏటయ్యా తొందర నేడి?..."

"ఊరికే వద్దులే!... ఓ అయిదు పారేస్తాను...

"నా బిడ్డమూగది బాబూ..." ముసిల్దాని స్వరంలో కంగారు...ఆందోళన చోటుచేసుకుంది.

"మూగదా?... అయితే యింకేం?.. మరీ మంచిది..."

"అదొట్టి పిచ్చిముండ బాబూ .. కాలూ చెయ్యి పడిపోయిన జలమం దాన్ది..." విషయం పూర్తిగా అర్థం చేసుకున్న ముసిల్ది భోరుమంది.

యాదగిరి ఆలోచన్లో పడ్డాడు.

ముసిల్దాని కూతురు మూగది పై పెచ్చు... అవిటిది కూడానా... అంటే తాను లోగడ బస్టాండులో చూచిన మనిషి కాదుగదా అనే అనుమానం యాదగిరిలో పొడచూపింది.

యాదగిరి కళ్ళముందు గతం మెదిలింది.

ఉదయాన మొదటి ట్రిప్పు డ్యూటీ చేస్తున్నప్పుడు ఓ పదహారేళ్ళ బిచ్చగత్తె బస్సులోకి జొరబడ్డది. పక్షవాతం వచ్చిన కారణంగా నోరూ చెయ్యీ పడిపోయిన ఆపిల్ల పక్కన వున్న ముసిల్ది ప్రయాణీకులను యాచిస్తూ భిక్షం అడుక్కోనారంభించింది.

ఆపిల్ల పరిస్థితికి జాలిపడ్డ ఒకరిద్దరు బస్సులో వున్న ప్రయాణీకులు ధర్మం చేశారు. ఖరీదైన ప్రయాణీకులు కసురుకున్నారు. అసహ్యించుకున్నారు.

తినేదైనాసరే.. సరిపెట్టుకోగలడన్పిస్తోంది. తన్లోవున్న ఆకలి అలాంటిది!!

పావుగంటక్రితం... హైక్లాస్ సరుకుకోసం దర్పాన్నీ... దర్జానీ ప్రదర్శించిన తాను... ఇప్పుడు స్థాయి దిగజారుతున్నం దుకు సిగ్గుపడ్లేదు. సిద్ధపడుతున్నాడు. కక్కూర్తిపడబోతున్నాడు. అవసరం తీర్చుకోబోతున్నాడు. వేడి చల్లార్చుకోగలిగి తేచాలు!!

తాను మనిషి!... అందునా మగాడు!!

ఇప్పుడు తనకో ఆడపదార్థం కావాలి! తన నరాల తీపు తగ్గాలి! — అంతే!!

ముసలిదాని చేతిలో అయిదు రూపాయల నోటు కుక్కి— దాన్ని గదమాయించి బైటికి పంపేడు.

నిద్రపోతున్న బిచ్చగత్తెనో తాపు తన్నేడు యాదగిరి.

మూగది గింజుకుంది... గీ... బే... అంది యాదగిరి మగతనం పిచ్చిదాన్ని సంపూర్ణంగా ఆక్రమించుకుంది.

అవిటి దానితో... మూ గ దా ని తో... యాదగిరి పొర్లేడు. అవసరం గడుపుకున్నాడు. ఆకలి తీర్చుకున్నాడు.

పెద్దులోంచి బైటికొచ్చిన యాదగిరి చొక్కా ముడుపు కున్నాడు. యాదగిరిలో తిమ్మిరి తగ్గింది.

తానుచేసిన పనికి సిగ్గుపడ్డాడు ... క్షణికమైన సుఖం కోసం తానెంత నీచానికి పాల్పడ్డాడో ఇప్పుడర్థమైంది. తనను తాను నిందించుకున్నాడు. తల అడ్డంగా ఆడించాడు-ముందుకు సాగిపోయాడు.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 15-5-80 సంచికలో ప్రచురితము.)

★